# 19. నల్లపిల్ల

ఆమెను అందరూ 'నల్లపిల్ల' అని పిలిచేవారు. ఆమె జుట్టు నల్లగా వుందని కాదు ఆమె శరీరచ్ఛాయ జీడిగింజలా వుంటుందనీ కాదు; కాని ఆమె పెదవులు నల్లద్రాక్షల్లాగు ఉంటయ్యని. అందరూ మంచి శరీరచ్ఛాయ గలిగిన యీ జిల్లాలో ఆమె నల్లదై పుట్టటమూ, వెన్నముద్దలాటి శరీరచ్ఛాయగల తల్లిదండ్రులకు ఆమె జన్మించటమూ – మనకుమాత్రం తెలియని రహస్యాలు. కాని అనాదినుంచీ దేశంలో తిరుగులాడే నల్లజాతి మనుషుల్తో ఆమె వంశంలోని ఒక స్త్రీకి ఏమో సంబంధం వుండేదని ఆ ఊళ్ళో అందరికీ తెలుసు.

ఆ పూర్వీకురాలినుంచి యీమెకు ఒక్క నల్లదనమే రాలేదు. నల్లటి ఆత్మా, ఒక్కో సమయాన లోతు తెలియని ఆకలిగొన్న మృగపుకళ్ళఛాయలు స్పష్టంగా కన్పించే నల్లటికళ్ళూ కూడా ఆమెకు సంక్రమించినయ్. అందమైనదా? కానేకాదు. కాస్తన్నా బాగుందా? ఉహుఁ. వికృతాకారి! ఆమె చూపులోనే అబద్ధానికి పునాది వుంది. ఎక్కడో పెద్ద దెబ్బతిన్నట్టు ముఖంలోకి అణిగిపోయిన ముక్కు, పూర్ణంగా తెరవబడలేని ఆమె నోరుచూపే ఆకలి ఛాయా, సంస్కరణ లేకపోవటం వల్ల పిచ్చికగూడులాగు తయారైన దట్టమైన జుట్టూ, పెద్దజ్వరంపడి ఇప్పుడే తేరుకుంటూన్న వ్యక్తిలాగు సన్నని అనారోగ్యకరమైన శరీరమూ, కుంటినడకా – ఆమెలో గమనించ దగ్గవి. ఒక్కమాటలో – ఆమెను చూడగానే దయ్యం జ్ఞాపకం రాకమానదు.

కాని ఆ చుట్టుపట్ల వున్న యువకులందరూ ఆమెను ప్రేమించేవాళ్లు; ఆ ప్రేమలో నెగ్గినవాళ్ళందరకూ ఆమె స్నేహాన్ని అభివృద్ధి చేసుకోవాలనే వాంఛ తీవ్రంగా వుండేది.

ఆమె పన్నెండో ఏటనుంచే ఆ ఊళ్లోని చాలామందికి ప్రియురాలిగా వుండేది. తన యీడుపిల్లల్ని ఎన్నిరకాలుగా చెడగొట్టవచ్చో, అందులో దేన్నీ ఆమె వృథాపోనివ్వదు.

యువకులూ, జీవితంలో చాలా అనుభవాల్ని చూసిన ముసలివాడూ, వ్యభిచారంలో మంచి ముద్రలు పడ్డవాళ్లూ, ఛైర్‌మెన్ చేసిన మార్టిన్ లాటి సాంఘిక గౌరవమున్న కులీనులూ ఆమె దృష్టిని పడకుండాపోలేదు. తన ప్రేమ మాట వదిలినా, ఆ ఊరి పోలీసువాడు తన బాధ్యత ప్రకారం ఏమీ చెయ్యకుండా ఆమె జోలికిపోవటానికి కారణం లేకపోలేదు. మేజిస్ట్రేటు ముందర తన సమస్యలు జారీకాకపోవటమే. తనకు సమనులు రాకుండా ఉండవనే నమ్మకం వాడికి లేదు.

ఊరందరికి ఆమె ప్రేయసి అయినా ఏ విధమైన ఆటంకమూ లేకుండానే ఆమె కాలంతోపాటు పెరిగివచ్చింది. ఆశ్చర్యపడాల్సిన విషయమేమంటే - ఇంతమంది ప్రియులలోనూ ఎవరికీ 'ఈర్ష్య' ఉండేది కాదు. ఒకడు తృప్తిపడ్డాక, ఏవిధమైన బాధా పడకుండానే ఇంకోడి తృప్తికి వదిలేవాడు.

ఒకసారి ఒక కొత్తమనిషి యీ విషయాన్ని గూర్చి ఆశ్చర్యంతో ఆమెను ప్రశ్నిస్తే, ఆమె అతని తెలివితక్కువతనానికి నవ్వి, "అందరికీ తృప్తిగావుందిగా!" అన్నది.

అలాటప్పుడు ఒకవేళ ఎవరికైనా ఈర్ష్య అనేదివున్నా ఆమెను తన స్వంతం ఎలా చేసుకోగలడు? తను కోరకుండానే ధన రూపాన కానీ, ఇతర రూపాన కానీ తన ప్రియులనుంచి వచ్చే అన్ని రకాల బహుమతుల్నీ ఆమె తీసుకున్నా - ఆమెకు స్వార్థం వుందనేందుకు వీల్లేదు; ఎందుకంటే, ఆమె తన తృప్తినిపట్టి తనే తన ప్రియులకు దొంగిలించయినా సరే బహుమానాలివ్వటంలో ఎప్పుడూ వెనుకంజవేసేది కాదు.

తనకు బహూకరించబడ్డ ఒక రూపాయికన్నా, దొంగిలించిన అణాయే ఆమెకు ఎక్కువ ఆనందాన్నిచ్చేది. ఆమెను పాలించాలనికానీ, తనొక్కడే ఆమె ప్రియుడవాలనికానీ ఉద్దేశం ఉన్నవాళ్ళు - ఆ విషయాన్ని గూర్చి కలలో ఆలోచించటంకూడా వృథాప్రయాస అనే విషయాన్ని బాగా తెలుసుకున్న వాళ్లే! ఎందుకంటే ఎంత పెద్దఛాతీవున్న మగాడు కూడా ఆ అర్హతను సంపాయించలేక పొయ్యే వాడు. ఊరంతా ఉపయోగించుకునే చెరువును ఏ ఒక్కడూ తన స్వంతం చేసుకునేందుకు ప్రయత్నించటంలో ఎంత మౌఢ్యం వుందో - వారందరికీ తెలుసు.

కాని బ్రూ అనే ఒక గొల్లవాడు మాత్రం పై కథలో ఇంతవరకూ తెర చాటునేవున్నాడు. వాడు గొర్రెలమందల్ని మేపుకుంటూ ఈ ఊరి పరిసర ప్రాంతాల్లో తిరుగుతూండేవాడు. కొన్నాళ్ళు ఒక ప్రదేశంలో కాపురముంటే, మరి కొన్నాళ్ళు ఇంకో ప్రదేశానికి మారేవాడు. వాడి కుటుంబానికల్లా వాడొక్కడే! వాడి మీద చాలారకాల చెడుకథలు ప్రచారంలోవున్నా, నిజానికి ప్రేమనుగూర్చి వాడికేమీ దమ్ములుండేవికావు.

మొదటి కారణం...ఊరివారందరి గొర్రెల్నీ వాడేమేపాలి. రెండో కారణం - వాడి ఆజ్ఞల్ని మాత్రమే శిరసావహిస్తూ, తోడేళ్ళపళ్ళున్న వాడి మూడు కుక్కలూ ఎప్పుడూ వాడి వెంట ఉండటం. మూడోది వాడు పెద్దమంత్రగాడనే నమ్మకం; వాడు తన విరోధుల మీద మంత్రశక్తితో కసితీర్చుకున్నాడనే కొన్ని కథలు ఇదివరకే ఊళ్ళో ప్రచారంలో వున్నయ్.

కాని ఆమె ఒకనాడు వీణ్ని గూర్చి ఆలోచించింది. చివరకు వాడి మంత్రశక్తికి భయపడకూడదనే నిశ్చయంతో వాడి దగ్గరికి వెళ్ళింది.

"ఏం కావాలి?" అన్నాడు వాడు.

"నాకా?" నువ్వే కావాలి–" అందామె ధైర్యంగా.

"సరే కాని, నువ్వు నా ఒక్కడి కిందనే ఉండాలి."

"సరే...కాని, నాకు తృప్తికలిగేవరకూను–"

ఒక వారంరోజులు ఆమె ఊళ్లో ఎక్కడా కన్పించలేదు. నిజానికి ఆమె ఒక్క బ్రూకు చెందిన ఆస్తిగానే ఉండిపోయింది. ఇది తెలుసుకున్నాక ఊరంతా ఉడికి పోయింది. వాళ్ళలో వాళ్ళకు అసూయలేదుకాని, అందరికీ గొల్లవాడి మీద కొత్తగా ఈర్ష్య రేకెత్తింది. ఇంతమందిలో ఏ ఒక్కడికీ, ఎన్నడూ స్వంతంకాని ఆమె, ఆలోచనకు అతీతమైన మంత్రశక్తి వాడిదగ్గర ఉంటే మాత్రం ఆ ఒక్కణ్నే ఎదుర్కోలేదా? వారందరికీ కోపం వచ్చింది. మెల్లిగా ధైర్యం తెచ్చుకొని చెట్లచాటునుంచి యీ నాటకమంతా కనిపెట్టారు. ఆమె ముఖకళ యేమీమారలేదు! కాని వాడు హఠాత్తుగా పెద్దజబ్బుపడి, ఆమె సేవను కోరుతూన్న వాడిలాగు ఉన్నాడు. ఐనా ఊరి వారికి గొల్లవాడి మీద దయ కలగలేదు.

అందులో ఒక యువకుడు ధైర్యంచేసి చేతులో తుపాకితో వాడి గుడిసెను సమీపిస్తూ, "బ్రూ! నీ కుక్కల్ని కట్టేసుకో; లేకపోతే నేను తుపాకీ కాల్చాల్సి వస్తుంది–" అన్నాడు.

ఆమె సమాధానం చెప్పింది; "కుక్కలకు నువ్వు భయపడక్కర్లేదు; అవి నిన్నేమీ చెయ్యవు."

"నీకేం కావాలి?" అన్నాడు గొల్లవాడు.

"నేను చెప్తాను. అతనికి నేను కావాలి...నేనందుకు ఇష్టపడుతున్నాను" అందామె.

బ్రూ విచారాన్ని సూచించాడు.

"నువ్వెందుకూ పనికిరావు" అని ఆమె యువకుడితో బయలుదేరింది. బ్రూ తన బలమైన కర్రను ఎత్తాడు; వెంటనే యువకుడు తుపాకికూడా ఎత్తాడు. "వాణ్ని పట్టుకోండి–" అని బ్రూ తన కుక్కల్ని పురిగొల్పాడు.

యువకుడు తుపాకీ గురిపెట్టి కాల్చేందుకు సిద్ధంగా వున్నాడు. కాని ఆమె తుపాకిని కిందికిదింపి, "రాండి-ప్చ్, ప్చ్, ప్చ్-" అని కుక్కల్ని ఆహ్వానించింది. వెంటనే మూడు కుక్కలూ ఆమె దగ్గరికి పరుగెత్తుకువచ్చి, తోకలు ఆడిస్తూ ఆనందంతో ఆమె చుట్టూ తిరగసాగాయ్.

ఆమె గొల్లవాడితో అంది: "చూడు...కుక్కలక్కూడా ఈర్ష్యలేదు-"

తరువాత కొంటెగా నవ్వుతూ ఆమె మళ్ళీ అంది: "ఆ కుక్కలు ఇప్పుడు నావి."